బస్తీ సమస్యలు పరిష్కరించాలి

అల్లాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని రామారావు నగర్, హరినగర్, రాధాకృష్ణనగర్‌లో నీటి సరఫరాలో సమయపాలన లేదని, గతంలో లాగా సాయంత్రం 7 గంటల లోపు నీటి సరఫరా అయ్యేలా చూడాలంటూ ఆయా కాలనీల ప్రతినిధులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ.. కాలనీలలో నెలకొన్న కరెంటు సమస్య, నిలిచిపోయిన కాలువ నిర్మాణం ప్రారంభించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సత్వరమే ఆయా సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కూకట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, వి.రామారావునగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటయ్యయాదవ్, ఏ.సంజీవ, భిక్షపతి, రాజా, చారి, శివ పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్‌టీ కాలేజీ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థి

నిజాంపేట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎంఎల్ఆర్‌టీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. అనంతరం 2 వందల మంది చిన్నారులకు భోజనం పంపిణీ చేశారు. ఈ రక్తదాన శిబిరంలో కళాశాల చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, అరుందతి ఆస్పత్రి డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్, బాలాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ నిర్వాహకులు ఉదయ్‌రంజన్‌గౌడ్, వలంటీర్లు ప్రశాంత్, ఆర్యన్, నరేష్ తదితరులు ఉన్నారు.

సాయిదత్తా గణపతి ఆలయ దశమ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త రవీందర్‌రెడ్డి దంపతులు, వేదపండింతులు

రాయదుర్గం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టెలికామ్‌నగర్‌లోని సాయి దత్తా గణపతి ఆలయం దశమ వార్షిక వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో వేడుకలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, గణపతి, దత్తాత్రేయస్వామి, పంచామృతాభిషేకము, మంగళస్నానాలు, రుద్రహోమము, నవగ్రహ హోమము తదితరులు పూజా కార్యక్రమాలు ఆలయ ధర్మకర్త ధర్మగారి రవీందర్ రెడ్డి దంపతులచేత చేయించారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ చేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డ్రింక్‌ప్రైమ్ సంస్థ ప్రతినిధులు

క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైటర్స్ స్టార్ జట్టు విజేత

కూకట్‌పల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డ్రింక్ ప్రైమ్ ప్రీమియర్ లీగ్ పేరుతో కేపీహెచ్‌బీకాలనీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో ఫైటర్స్ స్టార్ జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో 10 జట్లు పాల్గొనగా.. ఫైనల్స్‌లో విజయం సాధించిన ఫైటర్స్ జట్టుకు రూ.లక్ష బహుమతి సోమవారం అందజేశారు. ఈ పోటీలో ఫైటర్ స్టార్ జట్టు నుంచి ఆమోర్ జాంటీను ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, సన్‌రైజర్స్ ఎలెవెన్ జట్టు నుంచి నితీష్ బోయను ఉత్తమ బౌలర్‌గా ప్రకటించడతో పాటు చెరో రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. విజేతలకు డ్రింక్‌ప్రైమ్ సంస్థ నిర్వాహకులు విజయేందర్‌రెడ్డి, మానస్ రంజన్ బహుమతులు అందజేశారు.


పద్యనాటక కళాకారులను సన్మానిస్తున్న ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్

కళలను భావి తరాలకు అందించాలి

కూకట్‌పల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీకృష్ణరాయభారం పద్యనాటక ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. పద్యనాటకాలు, నాటికలు, పురాతన కళలను చూస్తుంటే చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పద్యనాటక కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తోట సత్యనారాయణ, శ్యామ్, మురళీధర్, శివకుమార్, నాయకులు కొల్లా శంకర్, ప్రసాద్, వాసుదేవరావు, షణ్ముక, మోహన్, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు శేరి సతీష్‌రెడ్డి

యువజన కాంగ్రెస్‌లో నియామకాలు

కూకట్‌పల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కమిటీలో నూతన నియామకాలు చేపట్టారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులుగా జెరిపటి రాజు, ఎండీ రావూఫ్, కార్యదర్శిగా శ్రీహరి, ఫతేనగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాకేష్‌ను సోమవారం నియమించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంది శ్రావణ్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్నం సునీతారెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టినట్లు పార్టీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి తెలిపారు.

జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో ఖాళీ స్థలం కబ్జా

జీడిమెట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో ప్రజా సంక్షేమం కోసం వదిలిన ఖాళీ స్థలాలను కొందరు స్థానిక నాయకుల అండదండలతో కబ్జాలకు పాల్పడుతున్నారు. రాజీవ్‌గృహకల్ప నిర్మాణ సమయంలో ప్రజల అవసరాల కోసం సంస్కృతి పాఠశాల పక్కన 200 వందల గజాల స్థలాన్ని ఖాళీగా వదిలారు. అయితే కొందరు వ్యక్తుల డబ్బాలు ఏర్పాటు చేస్తూ కబ్జాలు చేస్తున్నారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. గతంలో కూల్చిన చోటే తిరిగి నిర్మాణం చేపట్టారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న భరత్ సింహారెడ్డి

'ప్రజా సమస్యలను పరిష్కరిస్తా'

పేట్‌బషీరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్‌లోని గాయత్రినగర్‌లో స్థానికులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సుమీర్‌సింగ్, సంజీవరెడ్డి, శర్మ, బ్రిజేష్, జగ్గా, సుధీర్, రజనీకాంత్, మధు, రాజేశ్వరరావు, రమేష్, రాకేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


బక్రీద్‌ను పురస్కరించుకొని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన ముస్లింలు


మూసాపేటలోని కాంగ్రెస్ నాయకుడు మోయిజ్ ఇంట్లో వేడుకల్లో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు


ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు చెబుతున్న నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్


కేపీహెచ్‌బీకాలనీ: రమ్యగ్రౌండ్ మిత్రబృందం ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీలో ఎస్కే సత్తార్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్‌చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు


మూసాపేటలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు


మియాపూర్: హఫీజ్‌పేటలో ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు


గురుమూర్తినగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


రంగారెడ్డినగర్‌లో పాల్గొన్న చిన్నారులు

(జోన్‌బృందం- ఆంధ్రజ్యోతి)

కూకట్‌పల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో బక్రీద్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మూసాపేట, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని ముస్లింలు మజీద్‌లకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగాలకు ప్రతీకైన బక్రీదు వేడుకల్లో కుల, మతాలకు అతీతంగా నాయకులు, అధికారులు పాల్గొన్నారు. మూసాపేటలో బాలానగర్ డీసీపీ టి.శ్రీనివాసరావు, కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు ఎండీ.మోయిజ్ ఆధ్వర్యంలో మూసాపేటలో ఏర్పాటు చేసిన బక్రీద్ వేడుకల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శేరి సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో..

బక్రీద్ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పరిధిలోని నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి, జీడిమెట్ల, రంగారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బక్రీద్ త్యాగాలకు ప్రత్యేక అని పలువురు పేర్కొన్నారు.

గచ్చిబౌలిలో..

నియోజకవర్గంలో మైనార్టీలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయమే ఆయా ప్రాంతాల్లో ఉన్న ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరికొరకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కొండాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ ఈద్గావద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


పుష్పాలంకరణలో స్వామి

చందానగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ సాయిబాబా ఆలయ సముదాయంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చనలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ యుపీ రమణమూర్తి, సభ్యులు చంద్రశేఖరశర్మ, జైపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

మంజీర పైప్‌లైన్, సీసీరోడ్డు వేయించాలి


ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న పేట్‌బషీరాబాద్‌వాసులు

పేట్‌బషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగడిపేటలో మంజీర పైప్‌లైన్, సీసీరోడ్డు వేయించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు పేట్‌బషీరాబాద్‌వాసులు జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో కలిసి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. బస్తీలో పాత మంజీర పైప్‌లైన్ ఉండేదని, కొన్ని రోజుల క్రితం మురుగు నీటి పైప్‌లైన్ వేసినప్పుడు తవ్వకాల్లో మంజీర పైప్‌లైన్ మొత్తం పాడైపోయిందన్నారు. మంజీర నీరు సరఫరా అయినప్పుడల్లా తాగునీరు లీకై రహదారిలో పారుతోంది. పైప్‌లైన్లు మార్చి, నూతన పైప్‌లైన్ వేసి, సీసీ రోడ్డులను వేయాలని పులి మహేష్, బాబూగౌడ్, పులి చంద్రంగౌడ్, పులి బాలరాజుగౌడ్, యాదగిరి గౌడ్ తదితరులు కోరారు.

'ఇంజనీరింగ్ విద్యలో ఎమర్జింగ్ ట్రెండ్స్'

అంశంపై నేడు జేఎన్‌టీయూలో వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): 'ఇంజనీరింగ్ విద్యలో కొత్త పోకడలు' (ఎమర్జింగ్ ట్రెండ్స్) అంశంపై మ్యాథ్‌వర్క్స్, జేఎన్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఒకరోజు జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ, ఎలక్ట్రిఫికేషన్ వంటి ఆధునిక అంశాలపై యూనివర్సిటీ అనుబంధ, అఫిలియేటెడ్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థుల అవగాహనకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. వివిధ సంస్థలకు చెందిన నిపుణులు ఎమర్జింగ్ ట్రెండ్స్‌పై అవగాహన కల్పిస్తారని, బుధవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొనాలనుకునే అధ్యాపకులు, విద్యార్థులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఉచిత శిక్షణ

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ రంగాల్లో ఆరు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ చైర్మన్ ఏంసీ శేఖర్ తెలిపారు. ఫొటోగ్రఫీ అభిరుచి కల్గిన వారు, వృత్తిగా స్వీకరించేవారికి ప్రాథమిక ఫొటోగ్రఫీతోపాటు పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, ఆధునాతన సాంకేతికతలు, కంపొజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్, పోసింగ్‌లలో అనుభవం కల్గిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్స్ పట్టణగ్రామీణ యువతకు సాయం చేయడమే కాకుండా ఫొటోగ్రాఫర్‌గా ఎదిగి, వృత్తిగా స్వీకరించేవారికి ఉపాధి కూడా లభిస్తుందని వెల్లడించారు. ఈ కోర్సు జులై 15 నుంచి ప్రారంభమౌతాయని, ఆసక్తి కల అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు ఈ 80080 21075, 7095692175లలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

యునైటెడ్ ఫెలోషిప్ ప్రత్యేక ప్రార్థనలు


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలోని యునైటెడ్ ఫెలోషిప్ చర్చి నిర్వహిస్తున్న ప్రార్థనలు, స్తుతి ఆరాదనలు, వ్యాక్య పరిచర్య కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, వాసుదేవరావు, పాస్టర్స్ శ్యాముల్, శ్యామ్ జాషవ, సత్యరాజు, స్టీవెన్, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో ఫిట్స్‌తో ప్రయాణికుడి మృతి


వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబరు 10లో ఓ ప్రయాణికుడి(50)కి సోమవారం ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పతకాలు ప్రదానం చేసిన దామోదర్

జాతీయ పారా క్రీడల్లో జోహన్నాకు రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ జాతీయ పారా క్రీడల చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ప్లేయర్ జోహన్నా రజతంతో మెరిసింది. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో బాలికల సబ్ జూనియర్ స్విమ్మింగ్‌లో జోహన్నా ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, రాష్ట్ర ట్రైథ్లాన్ అధ్యక్షుడు పి.మదన్ మోహన్ విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ పీఎస్ పీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటలో నివాసం ఉంటున్న ఎన్ రామకృష్ణ(33) సోమవారం మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌పారం వెంట నడుచుకుంటూ వెళ్తుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో ఉప్పుగూడ-ఫలక్‌నామా రైల్వే స్టేషన్ల నడుమ సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో 35 ఏళ్ల వయస్సుల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలుదాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా రహదారులు


మియాపూర్ అధ్వానంగా ఉన్న రహదారులు

మియాపూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల పేరుతో రోడ్లను తవ్వి పనులు చేపట్టకుండా నెలల తరబడి వదిలేయడంతో రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, రాయదుర్గం ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనుల పేరుతో రోడ్లు తవ్వి వదిలేయడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వీటి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ స్పందించి త్వరగా రోడ్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.


మదీనగూడలో రోడ్డు పరిస్థితి




చందానగర్‌లో..

ప్రజలను చైతన్యవంతం చేసే రచనలు చేయాలి

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు ఆధ్యాత్మిక రచనలతో సమాజాన్ని చైతన్యవం తం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని కళాభారతిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ప్రముఖ రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రాసిన మేఘ సందేశం పుస్తకావిష్కరణ చేసి ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికత నేపథ్యంలో మేఘసందేశం పుస్తకాన్ని సమీక్షించి సైన్స్ ఆధ్యాత్మికత ఒకటేనని పలు అంశాలపై సోదాహరణంగా వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో కవులు డాక్టర్ జెల్లి విద్యాధర్, శ్రీనాథ, డాక్టర్ కావూరి శ్రీనివాస్, యాంకర్ జి. నవీనరాణి తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో భారీ వర్షం

- జలమయం అయిన రహదారులు
- ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడ్డ వాహనదారులు


కూకట్‌పల్లిలో కురుస్తున్న వర్షం

గచ్చిబౌలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో సోమవారం మధ్యాహ్నం వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు 40 నిమిషాల పాటు కురిసిన వర్షంతో లింగంపల్లి, చందానగర్, మియాపూర్, మదీనగూడ, హఫీజ్‌పేట, గచ్చిబౌలి, కొండాపూర్, మసీద్‌బండ తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వర్షపునీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. తారానగర్‌లోని కూరగాయల మార్కెట్ చిరువ్యాపారులు నానా అవస్థలు పడ్డారు. గచ్చిబౌలి, కొండాపూర్, మసీద్‌బండ ప్రాంతాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లో వాహనాలు చిక్కుకున్నాయి.


చందానగర్‌లో కాలనీని ముంచెత్తిన వరదనీరు


వరదనీటిలో వెళ్తున్న వాహనదారుడు

● కనిపించని మాన్‌సూన్‌టీంలు

ప్రతి సంవత్సరం వర్షాకాలంలో జీహెచ్ఎంసీ పరిధిలో మాన్‌సూన్ టీం బృందాలను ఏర్పాటు చేస్తారు. వాహనంతో పాటు నలుగురు సిబ్బంది టీంగా ఉంటారు. వరదనీటి కారణంగా ఏ ప్రాంతంలోనైనా ఇబ్బందులు ఎదురైతే సమాచారం అందిన వెంటనే వచ్చి ఆపదలో ఉన్నవారిని రక్షిస్తారు. చినుకుపడితే రోడ్లపై ఉండాల్సిన ఈ మాన్‌సూన్ వాహనాలు ఎక్కడా కనిపించ లేదు. అసలు ఈ వర్షాకాలంలో మాన్‌సూన్ టీంలను అధికారులు ఏర్పాటు చేశారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.